క్లుప్తంగా

కల్యాణోత్సవాల పందిరిరాటకు శ్రీకారం



అప్పనపల్లిలో పందిరిరాటకు పూజలు చేస్తున్న ఈవో, ట్రస్టీలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3 వరకు జరిగే స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం పందిరి రాట ముహూర్తం జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం పందిరి రాట పాతారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పందిరి రాట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు జ్యోత్స్నల సోమయాజులు, ఆలయ ఉప ప్రధానార్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు చైర్మన్‌తో పూజలు చేయించారు. ఎటువంటి విఘ్నాలు కలగకుండా స్వామి వారి కల్యాణం నిర్విఘ్నంగా జరగాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు గుత్తుల భానుప్రకాష్, బత్తుల విజయగంగారత్నం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి శ్రీనివాస్, పెదమల్లు ప్రతీక్, బొరుసు పండు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు మౌలిక వసతుల కల్పనతో పాటు రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు అల్లాడస్వామి నాయుడు కాలనీలో రహదారిని బుధవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ కాలనీలో రూ.5 లక్షలతో రెండు విడతలుగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, ఎంఎం శెట్టి, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, రాయుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.


స్వామికి సింహాసనం సమర్పణ



అప్పనపల్లిలో బాలబాలాజీకి సమర్పించిన టేకు సింహాసనంతో ప్రముఖులు

మామిడికుదురు: అప్పనపల్లిలో వేంచేసిఉన్న బాలబాలాజీ స్వామివారి సన్నిధిలో ఉత్సవ మూర్తులను ఉంచుటకు టేకు సింహాసనాన్ని బుధవారం భక్తుల సమర్పించారు. బోడసకుర్రుకు చెందిన చింత నాగేశ్వరరావు-మంగాదేవి దంపతుల కుమారుడు చింతా బాబి, పార్వతితో పాటు వారి కుటుంబ సభ్యులు సుమారు రూ.50 వేలు విలువైన టేకు సింహాసనం స్వామికి సమర్పించారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ చైర్మన్ సీహెచ్ రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు గుత్తుల భానుప్రకాష్, గూటం శ్రీనివాస్, పెదమల్లు ఉషారాణి, బత్తుల విజయ గంగారత్నం, బొరుసు పార్వతీ దుర్గాభవాని, ఆలయ ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు వారికి ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు ఈవో డి.రామవరప్రసాద్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు స్వాగతం



రావులపాలెంలో అభివాదం చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

కొత్తపేట: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోనసీమ పర్యటన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పవన్‌కు భారీ స్వాగతం పలికారు. అక్కడి నుంచి మందపల్లి, కొత్తపేట, పలివెల, ఖండ్రిగ, అవిడి మెయిన్ విలేజ్ మీదుగా ఆ గ్రామ పరిధిలో వరి ఆయకట్టు ప్రాంతానికి చేరుకున్నారు. కొత్తపేట బోడిపాలెం వంతెన వద్ద పార్టీ నాయకులు క్రేన్‌తో భారీ గజమాలతో స్వాగతం పలికారు. పలుచోట్ల మహిళలు హారతులిచ్చారు. ఆయన వెంట ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, పంతం నానాజీ, డీఎంఆర్ శేఖర్, పితాని బాలకృష్ణ, చిక్కం శివాజీనాయుడు, మహాదశ బాబులు, కంఠంశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అంబాజీపేట: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని తేమ శాతంతో పని లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ గంటి హరీష్‌మాధుర్, కో కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి డొక్కా నాథ్‌బాబులు డిమాండ్ చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద వరి రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్ పద్మకు బుధవారం అందజేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా యంత్రాలతో కోతలు

- ఊపందుకున్న రబీ మాసూళ్లు
- ఓ వైపు ప్రతికూల వాతావరణం
- మరో వైపు కూలీలకు కొరత



మామిడికుదురులో కబోటాల సహాయంతో పంట మాసూళ్లు

మామిడికుదురు: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు మిగిలిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ఎన్నో ఆశలతో సాగు చేసిన రబీ పంట అక్కరకు వస్తుందని రైతులు ఆశించారు. కానీ వారి ఆశలను అకాల వర్షం అడియాసలు చేసింది. ఎంతో కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో పడిన వర్షం రైతులను నిండా ముంచింది. దీంతో మిగిలిన పంటను త్వరగా కోత కోసి మాసూళ్లు పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉన్న రైతులు యాంత్రాలను ఆశ్రయించారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన యంత్రాలే కనిపిస్తున్నారు. వీటి సహాయంతో జోరుగా రబీ మాసూళ్లు నిర్వహిస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులో గుబులు నెలకొంది. ఒకే సారి పంట కోతకు రావడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో కూలీలకు తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపారు. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 20,254 ఎకరాల విస్తీర్ణంలో రబీ పంట సాగు చేశారు. దీనిలో 8,618 ఎకరాల్లో ఇప్పటి వరకు కోతలు పూర్తయ్యాయి. ఇంత వరకు 50 శాతం కూడా కోతలు పూర్తి కాలేదు. మిగిలిన పంటను సాధ్యమైనంత త్వరగా కోత కోసి ధాన్యం విక్రయించుకోవాలని రైతులు కంగారు పడుతున్నారు.

యంత్రాలకు పెరిగిన డిమాండ్

అకాల వర్షం ఒక వైపు తుపాను ఏర్పడే ప్రమాదం పొంచి ఉందన్న హెచ్చరికలు మరో వైపు రైతులను తీవ్రంగా కలవర పెడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి యంత్రాలను తీసుకువచ్చి వాటి సహాయంతో కోత కోస్తున్నారు. ఖరీఫ్‌లో గంటకు 2,800 నుంచి రూ.మూడు వేలు తీసుకున్నారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం గంటకు రూ.3,200 నుంచి రూ.3,300 తీసుకుంటున్నారని చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 50 వరకు కోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. అకాల వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో యంత్రాలు దిగబడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కోత కోసి నూర్పిడి చేసే అవకాశం లేక యంత్రాలతో కోత కోయిస్తున్నామని చెబుతున్నారు.

అయోమయంలో ఉన్నాను



18 ఎకరాలు లీజుకు తీసుకుని కౌలు వ్యవసాయం చేశా. పంట కోతకు వచ్చింది. చేలో ధాన్యం రాలిపోతుంది. త్వరగా కోత కోయాలి. ఇంత వరకు ఒక ఎకరం కూడా కోత కోయలేదు. యంత్రాలతో కోత కోయిద్దామంటే అవి బురదలో దిగబడి పోతున్నాయి. ఏం చేయాలో అర్థం కాని అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నా.

– కూన రామకృష్ణారావు, కౌలు రైతు, పెదపట్నం

చాలా భయంగా ఉంది



అప్పు చేసి రెండెకరాలు లీజుకు తీసుకుని రబీ పంట వేశా. ప్రస్తుతం ఆ పంట కోతకు వచ్చింది. కోత కోయిద్దామంటే కూలీలు దొరకడం లేదు. యంత్రాలతో కోయిద్దామంటే అవి దిగబడి పోతున్నాయి. రెండెకరాల్లో పంటను ఎలా ఒబ్బిడి చేయాల్లో అర్థం కాని పరిస్థితి. భారీ వర్షాలు కురుస్తాయన్న భయం మరో వైపు వెన్నాడుతుంది.

– బాలం శ్రీను, రైతు, మామిడికుదురు

పంట కోత కోయాల్సి ఉంది



ఐదెకరాలు లీజుకు తీసుకుని వరి పంట వేశాను. ఆ పంట కోతకు వచ్చింది. మంచి దిగుబడి వస్తుందని ఆనందంగా ఉన్న సమయంలో అకాల వర్షం పంటకు తీవ్ర నష్టం కలిగింది. మిగిలిన పంటను దక్కించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నా. దీన్ని ఎలా ఒబ్బిడి చేయాల్లో పాలు పోవడం లేదు. వరుణుడు కరుణిస్తే మిగిలిన పంటైనా దక్కుతుంది. లేదంటే చివరకు మిగిలేవి అప్పులే.

– మీర్ జుల్ఫీకర్ అలీ, రైతు, నగరం

ఘనంగా పీవీ రావు జయంతి



మలికిపురంలో పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అంబాజీపేట: మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతిని అంబాజీపేట బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి పులువురు పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ దళితుల ఐక్యతకు ఆయన చేసిన త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నూకపెయ్యి చిన్న, నాగాబత్తుల సుబ్బారావు, నెల్లి వెంకటరమణ, గోసంగి కుమారస్వామి, కోట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో బుధవారం పీవీ రావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

జేవీకే కిట్‌ను పరిశీలించిన అధికారులు



నగరం జెడ్పీ హైస్కూల్‌లో నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న అధికారులు

మామిడికుదురు: జగనన్న విద్యా కానుక (జేవీకే) స్టాక్ పాయింట్లను సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు బుధవారం పరిశీలించారు. నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఏఎంఓ పి.రాంబాబులు తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో వచ్చిన షూస్, నోట్ బుక్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్యా కానుక కిట్లలో సరఫరా అవుతున్న యూనిఫామ్, షూస్, నోట్ బుక్స్, బెల్ట్, బ్యాగ్స్ తదితర వస్తువులు పూర్తి నాణ్యతతో ఉండే విధంగా చూడాలన్నారు. అలాగే నోట్ పుస్తకాలు కూడా దిగుమతి చేసుకొని సమయంలో ఇండెంట్ ప్రకారం వస్తున్నవి లేనిది పరిశీలించుకుని తేడా వస్తే పై అధికారులకు తెలియజేయాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యయాత్రను విజయవంతం చేయాలి



నాగుల్లంకలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పి.గన్నవరం: మాదిగల సామాజిక చైతన్య యాత్ర ఈ నెల 13న చాకలిపాలెం సెంటర్‌కు చేరుకుంటుందని మాదిక సోదరులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ముస్కుడి సత్యనారాయణ అన్నారు. నాగుల్లంక శివారు ఉంద్రాజవరపువారిపేటలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం బుధవారం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు తెన్నేటి కిషోర్ మాదిగ చేస్తున్న మాదిగల సామాజిక చైతన్య యాత్ర చాకలిపాలెం సెంటర్ వద్దకు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటుందన్నారు. మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా విద్యా ఉద్యోగ రంగాలలో అభివృద్ధి కొరకు ఎనలేని కష్ట పడుతున్నారని అందుకు కిషోర్‌కి యావత్ జాతి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేలాది మంది మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉంద్రాజవరకు సురేష్‌బాబు, యార్లగడ్డ విజయ్‌కుమార్. యు.రాజేష్, యు.శేఖర్, బి.శ్యామ్, కే.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పి.గన్నవరం: రాజవరం-పొదలాడ రోడ్డులో ఊడిమూడి గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపూడి గ్రామానికి చెందిన జంగా అభిషేక్ (24) బుధవారం బైక్‌పై రావులపాలెం వెళ్తుండగా ఊడిమూడి గ్రామం వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా దారిలో మరణించాడు. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

ఆత్రేయపురం: మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన 15 ఏళ్ల మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసినట్లు బుధవారం వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. మార్చి 5న అంకంపాలెం గ్రామానికి చెందిన 15 ఏళ్ల మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన యాళ్ల జీవన్‌కుమార్ (24) మాయమాటలు చెప్పి లైంగికదాడి చేసినట్లు బాధితురాలి తండ్రి యడ్ల వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు.

ఈ - మోసాలతో జాగ్రత్త

అమలాపురం టౌన్: వ్యాపారులకు ఫోన్లు చేసి తాము కార్మిక శాఖ అధికారులమని చెప్పుకుని డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తున్న సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అమలాపురం సహాయ కార్మిక అధికారి పీఎస్ మహేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

ప్రతి హామీనీ అమలు చేశాం

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- అప్పనపల్లిలో గడప గడపకూ..



అప్పనపల్లి గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామంటూ ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం అప్పనపల్లిలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పలువురు తాగునీటి సమస్య ప్రస్తావించగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. ఎంతో మంది అధికారంలోకి వచ్చారు. కానీ అప్పనపల్లికి ఎవరి వల్లా సాధ్యం కాని పక్కా సిమెంట్ రోడ్డు నిర్మించడం ద్వారా గ్రామానికి ఎంతో మేలు చేశారని వృద్ధురాలు అడ్డగళ్ల నాగమ్మ ఎమ్మెల్యే చిట్టిబాబుకు ఆశీర్వచనం అందించారు. ఆమెకు ఎమ్మెల్యే అభివాదం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెడ్డం కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల జనార్ధన్, పార్టీ నేతలు గెడ్డం వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. అప్పనపల్లి కాజ్‌వే వద్ద రూ.5 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్‌కు ఎమ్మెల్యే చిట్టిబాబు శంకుస్థాపన చేశారు.

వివిధ శాఖల అధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ నాతి బుజ్జి

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలతో ఎంపీడీవో నాతిబుజ్జి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న డేటాలో ఎవరైతే పిల్లలు ఆధార్ నమోదు చేయించుకోకుండా ఉన్నారో వారందరికీ ఆధార్ చేయించుకునేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్లు, లేఎన్ఎంలు, మహిళా పోలీసులకు ఆదేశించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు గ్రామ స్థాయిలో పర్యవేక్షించి పూర్తి చేయాలన్నారు. ఆధార్‌కార్డులో జిల్లా మార్పు గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంఈవో వరప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కుమారి, మండల పర్యవేక్షకులు టీవీ సురేంద్రరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూలింగ్ టిన్నుల కళకళ



కమ్మిరెడ్డిపాలెంలో విక్రయానికి ఉంచిన కుండలు



కొత్తపేటలో ఒక చలివేంద్రంలో ఏర్పాటుచేసిన కూలింగ్ వాటర్ ప్లాస్టిక్ టిన్ను

- కనుమరుగవుతున్న కుండలు
- సరకు అమ్ముడుకాక విక్రేతలకు అవస్థలు

కొత్తపేట: వేసవి కాలంలో పలు వ్యాపార సంస్థలు, షాపులు వద్ద మంచినీటి కుండలు కనిపించేవి. ఇప్పుడు అవి కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో కూలింగ్ వాటర్‌తో కూడిన ప్లాస్టిక్ టిన్నులు కనిపిస్తున్నాయి. వేసవి వచ్చిందంటే ప్రజలు, ప్రయాణికులు, మార్కెట్‌కు వచ్చే క్రయ, విక్రయదారుల దాహార్తి తీర్చేందుకు పలు సేవాసంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవి. ఆ శిబిరంలో చెక్కతొట్టెల్లో ఇసుకపోసి దానిపై మట్టి కుండలు పెట్టి వాటిలో నీరు, మజ్జిగ పోసేవారు. తరచూ ఇసుక తడుపుతూ కుండలకు గుడ్డలు చుట్టి తడిపేవారు. అలాగే పలు వ్యాపార సంస్థల వద్ద కూడా ఇలాగే మట్టి కుండలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చేవారు. ఆ కుండల్లో మంచినీరు లేదా మజ్జిగ ఏ విధమైన కాలుష్యం లేకుండా చల్లగా ఉండేవి. అయితే వాటి స్థానంలో ప్లాస్టిక్ టిన్నులు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయనే ప్రచారంతో మంచి నీరు విక్రయ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సురక్షిత నీరు, మినరల్ వాటర్ పేరుతో మంచినీరు విక్రయిస్తున్నారు. అంతే కాకుండా కూలింగ్ టిన్నులు (ప్లాస్టిక్ ప్లాస్కులు) వాడుకలోకి వచ్చాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆ వాటర్‌నే ఏర్పాటు చేస్తున్నారు. ఆ నీరును ఆయా కేంద్రాల వద్దే కాకుండా డోర్‌డెలివరీ సప్‌లై చేస్తున్నారు. ఈ విధంగా మట్టి కుండలు కనుమరుగవగా ప్లాస్టిక్ కూలింగ్ వాటర్ టిన్నులు ప్రత్యక్షమయ్యాయి.

కుండల విక్రయం తగ్గిపోయింది



ప్రస్తుతం కూలింగ్ వాటర్ టిన్నులు రావడంతో మట్టి కుండల వాడకం తద్వారా విక్రయాలు తగ్గిపోయాయి. గతంలో ప్రతీ వేసవి సీజన్‌లో ఇళ్లల్లో, షాపుల్లో, చలివేంద్రాల్లో మంచినీరు పోసుకునేందుకు కుండలు అమ్మేవాళ్లం. కాలక్రమేణా కుండల వాడకం తగ్గిపోయింది. కొన్నైనా అమ్ముదామని తయారు చేసినా ఎవరూ కొనక అలాగే మిగిలిపోతున్నాయి.

– మంతెన సుబ్రహ్మణ్యం, కుండలు విక్రయదారుడు, కొత్తపేట